నేడు 'నారావారి' గృహప్రవేశం

- చంద్రబాబు కుటుంబ సభ్యులు హాజరు
- కుప్పంలో భారీ బందోబస్తు

కుప్పం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌కు చేరుకున్న నారా లోకేష్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కుప్పంలో తన సొంతింటి కల నెరవేర్చుకోనున్నారు. పలమనేరు రోడ్డులోని శాంతిపురం మండలం శివపురం వద్ద మూడేళ్ల క్రితం సొంతింటి నిర్మాణం చేపట్టారు. ఇంటి నిర్మాణాన్ని చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి దగ్గరుండి చూసుకునేవారు. ముఖ్యంగా భద్రత దృష్ట్యా నిర్మాణంలో జాగ్రత్తలు తీసుకున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు గృహప్రవేశ కార్యక్రమానికి నారా చంద్రబాబు కుటుంబ సమేతంగా భార్య, కొడుకు, కోడలు, మనవడుతో హాజరుకానున్నారు. అదేరోజు రాత్రి సొంతింట్లోనే బస చేసి సోమవారం ఉదయం 9.50 గంటలకు బయల్దేరి 10.20కి బెంగుళూరు చేరుకుని 11.15 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు బయల్దేరి వెళతారు. శనివారం రాత్రి 11.30 గంటలకు చంద్రబాబు చేరుకున్నారు. రాత్రి 8 గంటలకే సతీమణి నారా భువనేశ్వరి, కొడుకు లోకేష్, కోడలు బ్రహ్మణి, మనవడు దేవాన్ష్ ఆర్ అండ్ బి అతిథిగృహానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి గృహప్రవేశం సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్,. ఎస్పి మణికంఠ చందోలు భారీ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. 'నారావారి గృహప్రవేశం పేరుతో ముద్రించిన ఆహ్వాన పత్రికను కార్యకర్తలు గుడిపల్లి, కుప్పం, శాంతిపురం, రామకుప్పం మండలాల్లో నియోజకవర్గం మొత్తం అందజేశారు. అందరూ హాజరుకావాలని సిఎం స్వయంగా ఆహ్వానించారని తెలుస్తోంది.

ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న పేదలకు ఇవ్వాలి

- వ్యకాసం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు

స్థానిక రైతులతో మాట్లాడుతున్న వ్యకాసం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- పెద్దపంజాణి: ప్రభుత్వ భూములను అనుభవంలో ఉన్న కూలి రైతులకే పంచాలని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని బొమ్మలకుంట గ్రామంలో ఆయన పర్యటించి పేదలు ఎదుర్కొంటున్న భూ సమస్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 50 సంవత్సరాలు నుంచి 100 మంది రైతులు సుమారుగా 87 ఎకరాలు సాగులో ఉన్నారని, ఈ భూములకు 1992న పోరాటాల ఫలితంగా అప్పటి ఎమ్మార్వో దాదాపు సగం మందికి పట్టాలు పాసు బుక్కులు ఇచ్చారు కానీ అప్పుడు పెద్దపంజాణి గ్రామరెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న వ్యక్తి తన పలుకుబడిన ఉపయోగించి తప్పుడు రికార్డులను సృష్టించి ఆ భూములు మొత్తం తనవని సిసిఎల్ కోర్టులో కేసు వేశారని తెలిపారు. ప్రజలంతా దాదాపు 20 సంవత్సరాలుగా ఈ భూములు తమవని నెల్లూరు కలెక్టరేట్లో, ట్రిబనల్, సీసీఎల్ లోనా హైకోర్టులో, జిల్లా కోర్టులో ఈ భూములు పేదలకు చెందినట్లు తీర్పులిచారని కానీ స్థానిక రెవెన్యూ అధికారులు ఆ భూములను స్వాధీనం చేసుకొని అర్హులైన పేదలకు ఇవ్వకుండా చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు జిల్లా రెవెన్యూ అధికారులు ఇకనైనా స్పందించి పట్టాలు కలిగిన కూలీలకు జూన్ 10వ తేదీ లోపు ఆన్లైన్ చేసి వారికి భూమిపై హక్కులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తున్నామన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించకుంటే జూలై పదో తేదీ నాటికి గతంలో అర్హులైన కూలీలకు భూములు స్వాధీనం చేయకుంటే భూములు ఆక్రమించుకుంటామని ప్రభుత్వాలు జిల్లా రెవెన్యూ యంత్రాంగం పేదలకు న్యాయం చేయాలని కోరారు. వ్యకాసం జిల్లా అధ్యక్ష కార్యదర్శి చిరంజీవిమ్మ, ఓబుల్ రాజు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అన్నూరు ఈశ్వర్, వ్యకాసం డివిజన్ నాయకులు పాకాల సుబ్రహ్మణ్యం, అమర నారాయణ పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట పోలీసు బందోబస్తు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ఈనెల 24వ తేదీ నుండి 26వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శాంతిపురం మండలంలో నూతనంగా నిర్మించిన తన సొంత ఇంటి గృహప్రవేశానికి విచ్చేయుచున్న నేపథ్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ డీబ్రిఫింగ్ చేస్తూ భద్రతాపరమైన చర్యలను పటిష్టంగా నిర్వహించాలని ఈ పర్యటనలో భాగంగా ఎటువంటి అసమర్థత కనబరచారాదని తెలిపారు. అలాగే సిఎం తిరుగు ప్రయాణం అయ్యే వరకూ ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా గట్టి బందోబస్తు భద్రత కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బందోబస్తు అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తూ రూట్ మ్యాప్‌ను ప్రదర్శించి సిఎం పర్యటనను గురించి క్షుణ్ణంగా వివరించారు. సిఎం ఇల్లు, పరిసర ప్రాంతాలు, హెలిప్యాడ్, రోడ్డు మార్గాన కుప్పం చేరుకుంటారు కనుక రోడ్డు మార్గాన బందోబస్తులో ఉన్న సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉంటూ ఏవైనా అనుమానాస్పద వాహనాలు ఉన్న లేదా వ్యక్తులు సంచరిస్తున్న వెంటనే అధికారులకు తెలియజేయాలన్నారు. బిడి టీం సిబ్బంది సిఎం రోడ్డు మార్గాన అంతటా క్షుణ్ణంగా పరిశీలించాలి, ప్రతి కల్వర్టు డిటెక్టర్, డాగ్ స్క్వాడ్ సిబ్బందిచే మరింత జాగ్రత్తగా పరిశీలించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌జి డైరెక్టర్ నాచ్కేత్ విశ్వనాథ్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శివానంద కిషోర్, కుప్పం డీఎస్పీ పార్థసారథి, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం పర్యటనపై సూచనలు ఇస్తున్న జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే ఉచిత కంటి వైద్యశిబిరాన్ని 25వ తేదీ ఆదివారం స్థానిక రాముడు వారి గుడి వీధిలోని జైన్ ప్రార్థనా మందిరంలో నిర్వహిస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో జైన్ సంఘం ప్రతినిధి సుభాష్ జైన్ తెలిపారు. తిరుపతి అరవింద కంటి ఆసుపత్రి నిపుణులు వైద్యపరీక్షలు నిర్వహించి ఆపరేషన్లకు ఎంపికైన వారికి రవాణా, వసతి, భోజన సౌకర్యం ఉచితంగా కల్పించినట్లు తెలిపారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించుకునేందుకు ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకొని రావాలని కోరారు.

అన్ని సదుపాయాలతో బిసి భవన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరులో బిసి.భవన్ (మహాత్మా జ్యోతిరావు పూలే భవన్) నిర్మాణం రూ. 497లక్షల వ్యయంతో భవనంలో వివిధ సదుపాయాలు పూర్తి చేసినట్లు జిల్లా బీసీ సంక్షేమ అధికారి రబ్బానీ బాషా తెలిపారు. విశాలమైన ఫంక్షన్ హాల్, వధూవరులకు ప్రత్యేక గదులు, (అటాచ్డ్ టాయిలెట్‌లతో), డైనింగ్ హాల్, స్టోర్ రూమ్, వంటగది, పరిపాలనా పనులకు ప్రత్యేక కార్యాలయ గది, సాధారణ వినియోగానికి టాయిలెట్లు, అతిథుల వసతికి నాలుగు గదులు (అటాచ్డ్ బాత్రూమ్‌లతో), వాహనాల పార్కింగ్ ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల కోసం రోజుకు రూ.10వేలు అద్దె, వెనుకబడిన తరగతుల వర్గాల కోసం రూ.20వేలు, ఇతర వర్గాల కోసం రూ.30వేలు అద్దె చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

శ్రీవారి సేవను విశ్వవ్యాప్తం చేస్తాం : ఈవో

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు టిటిడిలో శ్రీవారి సేవను విశ్వవ్యాప్తం చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను టిటిడి ఈవో జె. శ్యామల రావు ఆదేశించారు. టిటిడి పరిపాలనా భవనంలోని ఈవో ఛాంబర్ లో శనివారం 14 దేశాలకు చెందిన వివిధ రంగాల ఎన్.ఆర్.ఐ నిపుణులతో వర్చువల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి భక్తులకు స్వచ్ఛందంగా కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు పలు రాష్ట్రాలనుంచి శ్రీవారి సేవకులు తిరుమలకు వచ్చి చక్కటి సేవలు అందిస్తున్నారని, త్వరలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ రంగాలలో నిపుణులైన ఎన్.ఆర్.ఐలు స్వచ్ఛందంగా సేవలు అందించేందుకు ముందుకు వస్తున్నారని చెప్పారు .టిటిడిలోని వివిధ విభాగాలలో దేశవ్యాప్తంగా శ్రీవారి సేవకులు అందిస్తున్నారని, వారి సేవలను విస్తరించేందుకు ప్రణాళికలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే అమెరికా తదితర దేశాలలో శ్రీనివాస కల్యాణాలు విరివిగా నిర్వహించేందుకు వారు సహకరిస్తున్నారని ,తాజాగా శ్రీవారి సేవలో తీసుకువస్తున్న సంస్కరణల మూలంగా వైద్యం, ఐటీ, ఇంజనీరింగ్, ప్లానింగ్, వాటర్ మేనేజ్మెంట్, ఫుడ్ టెక్నాలజీ, ఆర్కిటెక్చర్, టౌన్ ప్లానింగ్ తదితర విభాగాలలో సేవలు అందించేందుకు ఎన్.ఆర్.ఐలు ముందుకు వస్తున్నారన్నారు. ఎన్.ఆర్.ఐల నైపుణ్యం ఆధారంగా వారి సేవలను టిటిడిలో అమలు చేసేందుకు ప్రణాళికలు తయారు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు .వైద్య రంగానికి చెందిన వివిధ విభాగాల వైద్యులతో పాటు వివిధ రంగాల నిపుణులు సేవలు అందించేందుకు ముందుకు వచ్చారని ఈవో తెలిపారు.

త్వరలోనే టిటిడి నేత్రదాన ట్రస్టు ఏర్పాటు

టిటిడిలో మరింత పారదర్శకంగా సాంకేతిక సేవలను అమలు చేయనున్నట్లు ఈవో జె.శ్యామలరావు వెల్లడించారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో శనివారం జేఈవో వెంకన్నచౌదరితో కలిసి డయల్ యువర్ ఈవో కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 35 మంది భక్తులు అడిగిన పలు ప్రశ్నలకు ఈవో సమాధానమిచ్చారు. శ్రీవారి భక్తులకు టిటిడి అందిస్తున్న సౌకర్యాలు, చేపట్టిన సంస్కరణలను పలువురు భక్తులు అభినందించారు. త్వరలో టిటిడి నేత్రదాన ట్రస్టు ఏర్పాటుపై అరవింద్ కంటి ఆస్పత్రితో చర్చలు జరుపుతున్నామని కావలి నుంచి ఓ భక్తుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈవో వెల్లడించారు.

రూ.10 లక్షలు విరాళం

బెంగళూరుకు చెందిన అలెన్ కోచింగ్ ఇనిస్టిట్యూట్ వైస్ ప్రెసిడెంట్ మహేష్ యాదవ్ టిటిడి శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని స్కీంకు రూ.10 లక్షలు విరాళాన్ని శనివారం అందించారు.

గిట్టుబాటు ధరలపై రైతుల ఆశలు

పుంగనూరులో ధరలేక పశువులకు మేతగా టమాటాలను వదిలిన దృశ్యం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ధరలు స్థిరంగా లేకపోవడంతో ఏటా మామిడి రైతులు తీవ్రనష్టాలను చవిచూడాల్సి వస్తోంది.. ఇదే తరహాలో టమాటా రైతులు అల్లాడుతున్నారు. జిల్లాలో ప్రధాన వాణిజ్య పంటలైన మామిడి, టమాటా రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది.. జిల్లాలో లక్ష హెక్టార్లకు పైగా మామిడి సాగుతోంది. ఇదే తరహాలో టమాటా 40వేల హెక్టార్లకు పైగా పలమనేరు, శాంతిపురం, కుప్పం, రామకుప్పం ప్రాంతాల్లో సాగు చేస్తున్నారు.. గత 15 రోజులుగా టమాటా ధరలు తీవ్రంగా పతనం కావడంతో పలమనేరు మార్కెట్ యార్డులో కిలో టమాటా రూ.5లకు మించి అమ్ముడు పోవడం లేదు. కనీసం పెట్టుబడి కూడా రాకపోవడంతో అనేకమంది రైతులు టమాటాలను కోయకుండా పొలాల్లోనే వదిలేస్తున్న పరిస్థితి.

ప్రజా'దృష్టి'

ఇదిలా ఉంటే మరో 15 రోజుల్లో మామిడి సీజన్ ప్రారంభం కానుంది. మామిడి గిట్టుబాటు ధరపై ఈనెల 22వ తేదీ జిల్లా కలెక్టరేట్లో మామిడి రైతులు, గుజ్జు పరిశ్రమల యజమానులతో జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తోతాపూరి రకానికి ధర నిర్ణయిస్తారని మామిడి రైతులు ఆశించిన గుజ్జు పరిశ్రమల యజమానులతో చర్చించిన అధికారులు తోతాపూరి రకం ధరను నిర్ణయించకుండానే సమావేశం ముగిసింది. జిల్లాలో ఎగుమతులకు నోచుకోకుండా పల్ప్ గుజ్జు పరిశ్రమల్లో 1,50,000 టన్నుల మామిడి గుజ్జు నిలువలు పేరుకుపోయాయి. ఇదే పరిస్థితి కొనసాగితే ఏడాది తోతాపూరి రకం కొనుగోలు మందకొడిగా సాగే అవకాశం ఉందని పల్ప్ గుజ్జు పరిశ్రమలు యజమానులు అంచనా వేస్తున్నారు.

మామిడి గుజ్జు పరిశ్రమల యజమానుల విజ్ఞప్తి మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం భక్తులకు శీతల పానీయాల కోవలో మామిడి జ్యూస్ అందించేందుకు ప్రభుత్వం అంగీకరించినట్లు సమాచారం. ఇలా భక్తులకు మామిడి జ్యూస్ అందించిన జిల్లాలో పేరుకుపోయిన పల్ప్ నిలువల్లో 20 నుంచి 30 శాతం మాత్రమే ఖాళీ అయ్యే పరిస్థితి ఉంటుందని మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులు చెబుతున్నారు. ప్రభుత్వ విద్యారంగ సంస్థల్లో చదువుతున్న పిల్లలకు మధ్యాహ్న భోజనం సమయంలో మామిడి జ్యూస్ అందించడంతోపాట ఇతర ఎండోమెంట్ దేవాలయాల్లోని భక్తులకు కూడా మామిడి జ్యూస్ అందించి మామిడి గుజ్జు పరిశ్రమలను ఆదుకోవాలని కోరుతున్నారు.

మరోవైపు ఈ ఏడాది 50శాతం మామిడి దిగుబడి వచ్చే అవకాశం ఉన్నట్లు ఉద్యానవన శాఖ అంచనా వేసినప్పటికీ అకాల వర్షాల కారణంగా మామిడి పంట నేలరాలింది. ఫలితంగా దిగుబడి తగ్గే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు.. దిగుబడి తగ్గిన పెరిగిన తోతాపూరి రకానికి 15 నుంచి 20వేల రూపాయలు టన్నుకు లభిస్తుండడంతో మామిడి రైతులు ఏటా నష్టపోవాల్సి వస్తోంది. మామిడి, టమాటా బోర్డులను ఏర్పాటు చేసి ధరల స్థిరీకరణ చేయాలని జిల్లాలోని మామిడి, టమాటా రైతులు, రైతు సంఘాలనేతలు కోరుతున్నారు. తోతాపూరి మామిడి రకానికి టన్ను 30 వేలు, టమాటా టన్ను 20 నిర్ణయించాలని రైతులు కోరుతున్నారు.

పక్కాగా 'సివిల్ సర్వీసెస్ ప్రిలిమనరీ' ఏర్పాట్లు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ 2025 పరీక్షా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల 25వ తేది ఆదివారం నగరంలోని 13 కేంద్రాల్లో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ 2025 పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో జరుగుతాయని అన్నారు. ఉదయం 9.30 నుండి 11.30 వరకు, మధ్యాహ్నం 2.30 నుండి 4.30 వరకు పరీక్షలు జరుగుతాయని అన్నారు. అభ్యర్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా సంతోషంగా పరీక్షలు రాసేలా ఏర్పాట్లు ఉండాలని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పరిశుభ్రంగా ఉంచాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, త్రాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్ ఉన్నారు.

పటిష్టమైన భద్రత : ఎస్‌పి

తిరుపతి సిటి : ఆదివారం జరగనున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలకు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 13 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. 5261 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఎగ్జామ్ సెంటర్ల కు సమీపంలో ఉన్న ఇంటర్నెట్, జిరాక్స్ షాపులను మూసివేయాలని ఆదేశించారు. నిరంతరం డిఎస్పి స్థాయి అధికారి పర్యవేక్షిస్తారు.

ఇంటింటా సర్వేలో వ్యాధులు గుర్తించాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి.సుధారాణి శనివారం నగర పరిధిలోని రెడ్డిగుంటలో గల డిఆర్డిఏ స్కిల్ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రజలకు సంక్రమణ, అసంక్రమణ వ్యాధులపై అవగాహన కల్పించారు. గుండె జబ్బులు, క్యాన్సర్లు, థైరాయిడ్, బిపి, షుగర్, లివర్ వ్యాధులు, మూత్రపిండాల వ్యాధులు అసంక్రమణ వ్యాధులు అని, ఇవి ఇతరులకు వ్యాపించవని, వీటిని దీర్ఘకాలిక వ్యాధులు అంటామని తెలిపారు. ఈ వ్యాధులు ఒక్కసారి వస్తే జీవితాంతం మందుల వాడాల్సిన పరిస్థితి అని తెలిపారు. అందుకే ప్రభుత్వం ఇంటింటి ఎన్సీడీ ప్రత్యేక సర్వే కార్యక్రమాన్ని 18 సంవత్సరాల పైబడిన వారికి చేస్తుందని, ఇందులో బిపి, షుగర్, కేన్సర్ వంటివి స్క్రీనింగ్ చేసి చికిత్స చేయించి ఫాలోఅప్ చేస్తారని తెలిపారు. కావున ప్రతి ఇంటిలో తప్పనిసరిగా ఈ సర్వే కార్యక్రమాన్ని ఉపయోగించుకొని కేన్సర్ లేని సమాజ స్థాపనకు మనమందరం కృషి చేద్దామని తెలిపారు. అలాగే ఈ సీజన్లో డెంగీ, మలేరియా వంటి అంటువ్యాధులు కనిపిస్తున్నాయని ప్రతి ఒక్కరూ ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని సమిష్టిగా తప్పక పాటిస్తే లార్వాలు నశించి డెంగీ ప్రబలకుండా ఉంటదని తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, భోజనానికి ముందు చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అనూష, శ్రీవాణి, జయరాముడు, రాజేంద్రప్రసాద్, డిఆర్‌డిఏ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ అవసరాన్ని తీర్చేదే సాహిత్యం

ప్రజాశక్తి -రామచంద్రపురం(తిరుపతి రూరల్)

కాలానుగుణంగా సమాజానికి ఏమి అవసరమో దాన్ని సాహిత్యం తీర్చుతుందని కథ ,నవల, నాటక రచయిత డాక్టర్ వి ఆర్ రాసాని అన్నారు. శనివారం తిరుపతిలోని స్థానిక యూత్ హాస్టల్లో అనంతపురం జిల్లా వాసి డాక్టర్ బి నాగ శేషు రచించిన 'ఏకుదారం' పుస్తకావిష్కరణ జరిగింది. ప్రాచ్య పరిశోధన సంస్థ డైరెక్టర్ ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు పుస్తకావిష్కరణ చేశారు. తొలి ప్రతిని రచయిత ఆర్ . సి.కష్ణస్వామి రాజు అందుకున్నారు. సభకు ఈ తరం కవిత వేదిక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాసాని మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో బీరప్ప గురించి ఎవరికి తెలియదని చెప్పారు. పుస్తక ఆవిష్కరణ కర్త ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ నవలలో రచయిత నాడి స్పందన ఆద్యంతం కనిపిస్తోందని తెలిపారు. ఆత్మీయ అతిథి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వై.సుభాషిని మాట్లాడుతూ కులవత్తిదారులు ప్రపంచీకరణలో కొట్టుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో ఆత్మీయ అతిథి బొమ్మిశెట్టి రమేష్ మాట్లాడుతూ జీవితంలో కష్టాలు ఎదురైనప్పుడు ఆత్మ పరివర్తన ,ఆత్మహత్య అను రెండు మార్గాలు ఉంటాయని వాటిలో రచయిత ఆత్మ పరివర్తన దిశగా వెళ్లి అత్యద్భుతంగా అభివద్ధి చెందారని వివరించారు. పీలేరు డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ కే.శ్రీనివాసులు రెడ్డి పుస్తక సమీక్ష చేస్తూ స్థలం, కాలం, చలనం గురించి ఈ నవలలో స్పష్టంగా ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రచయితలు ఆకుల మల్లేశ్వరరావు, పేరూరు బాలసుబ్రమణ్యం, మారిశెట్టి గోవిందు, డాక్టర్ యువశ్రీ పాల్గొన్నారు.

కుక్కలున్నాయి.. పిక్కలు జాగ్రత్త..

సోమల -పుంగనూరు మార్గంలో వీధి కుక్కలు

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమలలో కుక్కల బెడద రోజురోజుకు తీవ్రమవుతూ వస్తోంది. సోమలలో నిత్యం ప్రయాణికుల రాకపోకలతో వాహనాల రద్దీతో ఉంటుంది. చికెన్, మటన్ విక్రయ దుకాణాలు బస్టాండు కూడలి, పుంగనూరు రోడ్డు, నంజంపేట రోడ్డు మార్గాలలో అధికంగా ఉండడంతో కుక్కలు మాంసం కోసం దుకాణాల వద్ద రోడ్డుపై వేచి ఉంటూ వచ్చిపోయే ద్విచక్ర వాహనచోదకులను, పాదచారులను, చిన్నారులను, వృద్ధులను కరుస్తూ గాయం చేసి ఆసుపత్రిపాలు చేస్తున్నాయి. గతవారం నలుగురు వ్యక్తులను కుక్కలు కరచి గాయపరచడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొంది మెరుగైన చికిత్స కోసం సదం సిహెచ్‌సికి వెళ్లారు. ప్రజలు కుక్కల బెడద కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పంచాయతీ వారికి కానీ మండల స్థాయి అధికారులకు కానీ పట్టినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో తొమ్మిది గంటల తర్వాత ఎవరైనా రోడ్డుపైన తిరగాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. ఒక్కో కుక్క భారీ ఆకారంతో చూడగానే భయానికి గురయ్యే విధంగా ఉన్నాయి. ఇకనైనా ప్రజల సమస్యను గుర్తించి పంచాయతీ వారు అధికారులు పరిష్కార మార్గాలు చూడాలని ఆశిద్దాం.

యోగాతో మానసిక ఒత్తిళ్లు దూరం: ఆర్‌డిఓ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: యోగా చేయడం ద్వారా మానసిక ఒత్తిళ్లు, ఆరోగ్య సమస్యలను అధిగమించ వచ్చునని చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. శనివారం చిత్తూరు పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద యోగాంధ్ర (మే 21 నుండి జూన్ 21 వరకు) మాసోత్సవాలకు సంబంధించి యోగా కార్యక్రమంను చిత్తూరు ఆర్‌డిఓ, చిత్తూరు డీఎస్పి సాయినాథ్, పర్యాటకశాఖ అధికారి గౌరీ, డిఎస్‌డిఓ బాలాజీ, చిత్తూరు టౌన్ సిఐ మహేశ్వరలతో కలసి యోగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 21 నుండి జూన్ 21వ తేదీ వరకు యోగ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా చిత్తూరు పట్టణ కేంద్రంలోని గాంధీ సర్కిల్ వద్ద యోగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామనన్నారు. ప్రతి ఒక్కరూ తమ రోజువారి ప్రణాళికలో యోగాకు సమయం కేటాయించి ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. డీఎస్పీ మాట్లాడుతూ అవగాహన కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని వారి అనారోగ్య సమస్యలు, మానసిక ఒత్తిడిలను తగ్గించుకుని పరిపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, యోగా గురువులు బాబు, రాజేంద్ర, మున్సిపల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో దగా..!

- వ్యాపారుల అదనపు తూకం
- పరపతి సంఘాలలో కొనుగోళ్లు లేక నలిగిపోతున్న అన్నదాతలు
- నిద్రావస్థలో ప్రభుత్వం

ప్రజాశక్తి -వెదురుకుప్పం: రైతన్నలు వరి నాటినప్పటి నుంచి అనేక వ్యయప్రయాసలను అధిగమించి వరి సాగు చేసిన రైతులకు ధాన్యం విక్రయాలలో దగాకు గురవుతున్నారు. మండలంలో పలుచోట్ల పరపతి సంఘాలు కొనుగోలు లేక వ్యాపారుల చేతిలో అన్నదాతలు నలిగిపోతున్నారు. ఎంత నష్టపోతున్నా చేసేదేమీ లేక నిస్సహాయ పరిస్థితిలో అయోమయంలో పడ్డారు. ఇలానే చూస్తుండడం తప్ప ప్రభుత్వాలు, అధికారులు ఏమీ చేయడం లేదు. గ్రామీణ ప్రాంతాలలో నిర్దేశించిన ప్రకారం ఒక సంచి బస్తాలో 80 కేజీల ధాన్యం తూకం వేయాలి. అయితే రైతన్నలు శుద్ధి చేయలేదని, తేమ ఎక్కువగా వుందని నెపంతో వ్యాపారులు అదనంగా మూడు కేజీల నుంచి తొమ్మిది కేజీల వరకు ఎక్కువగా తూకాలు వేస్తున్నారు. వారి నష్టం అంతటితో ఆగడం లేదు.. మొత్తం బస్తాలు ఎన్ని అని లెక్క గట్టి ఎక్కువగా వచ్చిన కేజీలను లెక్కలోకి చూపకుండా డబ్బులు చెల్లిస్తున్నారు. చేసేదేమీ లేక మరో మార్గం లేక ఇచ్చినంత తీసుకుని రైతులు మౌనంగా వుంటున్నారు.

రైతులు నష్టపోతున్నది ఇలా..

ప్రస్తుతం మండలంలో వరి కోతలు సాగుతున్నాయి. కోతలు పూర్తి అయిన వెంటనే ఇంటికి కొంత ధాన్యాన్ని ఉంచుకుని, మిగిలిన ధాన్యాన్ని వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఒక్కొక్క బస్తా 80 కేజీల తూకం అయితే వరి ధాన్యంలో తేమ ఎక్కువగా ఉందని 80 కేజీల నుంచి 89 కేజీల వరకు తూకం పెట్టి అదనపు భారం రైతుపై వేస్తున్నారు. మోసం జరుగుతోందని తెలిసినా రైతులు ప్రశ్నించలేని పరిస్థితి. వ్యాపారులు వద్దంటే ఆ ధాన్యానికి ధర ఉండదేమో... మళ్లీ వ్యాపారులు రారేమో అని అనుమానం వారిని పీడిస్తోంది. దీన్ని ఆసరగా చేసుకుని వ్యాపారుల ఆగడాలు అధికమవుతున్నాయి. దీనికి తోడు ఒక్కొక్క బస్తాకి ఒక్కొక్క కేజీ తరుగు అని తీసి లెక్క వేస్తున్నారు.

పరపతి సంఘాలు..పత్తా లేదు..

గతంలో 2019వ సంవత్సరం రైతుల దగ్గర నుంచి వ్యవసాయ పరపతి సంఘం వారు ధాన్యాన్ని కొనుగోలు చేశారు. వచ్చిన మొత్తాన్ని రైతుల బ్యాంకు ఖాతాలలో జమ చేశారు. ఈ ఆర్థిక సీజన్లో వ్యవసాయ పరపతి సంఘం వారు రైతుల దగ్గర నుంచి వరి ధాన్యం కొనుగోలు చేయలేదు. జాడే లేదు. ప్రశ్నిస్తే 'మాకు అనుమతులు లేవు!' అని చెబుతున్నారని రైతులు వాపోతున్నారు.

మండలంలో వరి ధాన్యం దిగుబడి

వెదురుకుప్పంలో ఎక్కువ భాగం రైతు కుటుంబాలే. జీవన ఆధారం వ్యవసాయమే.. 25 గ్రామ పంచాయతీలు వుండగా గత సీజన్లో వర్షపాతం ఎక్కువగా నమోదయింది. దీంతో రైతులు తమ భూములలో వరి పంటను పండించారు. 720 హెక్టార్లలో వరి పంట సాగు అయ్యింది. 368 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వచ్చిందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఎక్కువ భాగం 7 డిపి37 రకం. (బుడ్డ వడ్లు) ప్రస్తుతం కోత దశలో వుంది.

పక్క రాష్ట్రాలకు తరలుతున్న వరి ధాన్యం

తమిళనాడు నుంచి వచ్చిన లారీలు, వరి ధాన్యం లోడ్ అవుతున్న దృశ్యం..

పక్క రాష్ట్రమైన తమిళనాడు నుంచి వ్యాపారులు ఆంధ్రకు వచ్చి దళారులను ఆశ్రయించి తక్కువ ధరకి ధాన్యాన్ని కొనుగోలు చేసి వరి ధాన్యాన్ని తమిళ నాడుకు తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. 80 కేజీల బస్తా సుమారు రూ.1300 నుంచి రూ.1500 లోపే వుందని రైతులు మీడియాకు చెబుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు మేలు చేయాలని రైతన్నలు వేడుకుంటున్నారు.

ఇళ్ల నిర్మాణాలు తనిఖీ చేస్తున్న ఎంపిడివో బాలాజీ

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి: ఎంపీడీవో

ప్రజాశక్తి -పెద్దపంజాణి:

మండలంలోని గ్రామ పంచాయతీలోని గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న ఇంటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బాలాజీ హౌసింగ్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన భద్రాచలంలో పెండింగ్‌లో ఉన్న ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఇళ్లను గుర్తించి వాటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో గృహ నిర్మాణ లబ్ధిదారులతో అధికారులు సచివాలయ సిబ్బంది, గృహ నిర్మాణ శాఖ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ కలసి గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని కోరారు. ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని అవగాహన కల్పించాలన్నారు. భద్రాచలం గ్రామంలో గృహ నిర్మాణ లబ్ధిదారులకు అవగాహన కలుగజేసే కార్యక్రమంలో ఎంపీడీవో బాలాజీ, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ అభివృద్ధి మల్లికార్జున పాల్గొన్నారు. మండలంలో రూఫ్ లెవల్లో 121 గృహాలు రూఫ్ కంప్లీషన్ స్థాయిలో 81 గృహాలు ఉన్నాయని, ఈ రెండు వందల రెండు గృహాలను పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ద్వారా లబ్ధిదారులను పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ కలసి వారి ద్వారా గృహ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు కృషి చేయాలని జిల్లా అధికారులు ఆదేశించినట్లు ఎంపీడీవో తెలిపారు.

ఇళ్లకు నెంబర్ ప్లేటు వేయించుకోవాలి

- రాత్రి వేళల్లో మైకుల్లో ప్రచారం - ధృవీకరించాలంటున్న ప్రజలు

ప్రజాశక్తి -సోమల:

మండల కేంద్రమైన సోమల తదితర గ్రామాలలో కొద్ది రోజులుగా కొంతమంది యువకులు ప్రతి ఇంటికి డోర్ నెంబర్ ప్లేట్ వేయించుకోవాలని ఇందుకోసం కొంత డబ్బు వసూలు చేస్తూ ఉన్నారు. రాత్రి వేళల్లో పల్లెల్లో ద్విచక్ర వాహనంపై మైక్ చేతబట్టి మైక్ లో ప్రతి ఇంటికి డోర్ నెంబర్లు నెంబర్ ప్లేట్లు వేస్తున్నామని ప్రతి ఒక్కరూ వేయించుకోవాలని ప్రచారం చేస్తున్నారు. అయితే దీనిపై అటు పత్రికల వారికి గాని, ప్రజలకు గాని పంచాయతీ ఇతర మండల స్థాయి అధికారులు ఎలాంటి సమాచారం తెలుపలేదు. ప్రభుత్వం ఇందుకోసం ఎవరినైనా నియమించిందా? నెంబర్ ప్లేట్ వేయించు కుంటే ఎంత డబ్బు ఇవ్వాలి రసీదు ఏమైనా ఇస్తారా? తదితర విషయాలను అధికారులు తెలియజేయాల్సి ఉంది. దీంతో ప్రజలు ఒకింత అనుమానం వ్యక్తం చేస్తున్నారు ప్రజల అనుమానాన్ని నివృత్తి చేయడానికి అధికారులు వెంటనే దీనిపై వాస్తవ ప్రకటన చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రేషన్ షాపు డీర్లతో మాట్లాడుతున్న తహశీల్దారు

ప్రజలకు అందుబాటులో సరఫరా చేయండి

రేషన్ షాపు డీలర్లకు తహశీల్దారు ఆదేశం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి:

ప్రజలకు అందుబాటులో వుండి సరుకులుసరఫరా చేయాలని రేషన్ షాపు డీర్లను తహశీల్దారు ఆదేశించారు. మండల పరిధిలోని 36 మంది రేషన్ షాప్ డీలర్లకు తహశీల్దారు ఎమ్ఎస్ ప్రసన్నకుమార్ శనివారం సమావేశం నిర్వహిం చారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు రేషన్ బియ్యం పాత పద్ధతిలో రేషన్ షాపులోనే డిస్ట్రిబ్యూషన్ జరిగేలా చర్య చేపట్టినట్లు డీలర్లకు తెలియజేస్తూ జూన్ ఒకటో తేదీ నుండి ప్రతి నెల 15 వ తేదీ వరకు డీలర్లు షాపు వద్ద ఉండి రేషన్ కార్డుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సక్రమంగా వారికి అందాల్సిన నిత్యావసర సరుకులను అందించాలని ఆయన రేషన్‌షాపు డీలర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రేషన్ షాప్ డీలర్లు పాల్గొన్నారు.

లక్ష్మమ్మకు నివాళి

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: గంగాధర నెల్లూరు మండలం బాలగంగనపల్లె పంచాయతీ మాజీ సర్పంచ్ , టిడిపి నేత దేవరాజులు తల్లి లక్ష్మమ్మ (88)శనివారం ఉదయం మరణించింది. ఈ నేపథ్యంలో లక్ష్మమ్మ మృతదేహానికి టిడిపి నేతలు కృష్ణమ నాయుడు, భీమినేని చిట్టిబాబు నాయుడు, శ్రీధర్ యాదవ్, దేవపత్ని ధనంజయ నాయుడు, స్వామి దాస్ , మోహన్ నాయుడు, హరీష్ యాదవ్, రఘునాధనాయుడు, యువరాజు రెడ్డితో పాటు పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించి , అనంతరం టిడిపి నేత దేవరాజులను పరామర్శించారు. లక్ష్మమ్మ అంత్యక్రియలు ఆదివారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

లక్ష్మమ్మకు నివాళులు అర్పిస్తున్న టిడిపి నాయకులు

వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న సిహెచ్‌వో లక్ష్మీనారాయణ

అప్రమత్తం చేయాలి: సిహెచ్‌వో

ప్రజాశక్తి -యాదమరి: దేశంలో కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యం లో ప్రజలను అప్రమత్తం చేయాలని యాదమరి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ సిబ్బందికి సూచించారు. శనివారం ఉదయం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షేత్రసాయి సిబ్బందితో సమావేశమైన ఆయన మాట్లాడుతూ దేశంలో తిరిగి కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మన రాష్ట్రంలో మూడు కేసులు నమోదైనట్లు సమాచారం వచ్చిందన్నారు. ఈ విషయమై ఇప్పటి నుండే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని వ్యక్తిగత దూరం, బయటకు వెళ్లినప్పుడు మాస్కు ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపరువైజర్లు సెల్వరాణి, లక్ష్మీపతి, మహిళా ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మామిడి, టమాటో రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి-పలమనేరు: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా రైతాంగానికి సిరులు కురిపిస్తామంటూ చేస్తున్న వాగ్దానాలు కేవలం కంటితుడుపు చర్య తప్ప రైతాంగానికి ఒరిగిందేమీ లేదని ఏఐకేఎంఎస్ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు ఉమాపతి నాయుడు పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో మామిడి, టమోటో రైతాంగం గిట్టుబాటు ధర లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ఇప్పటివరకు జిల్లా అధికారులు, గుజ్జు ఫ్యాక్టరీ యజమానులు,కొందరు రైతులతో రెండు దపాలు ఉత్తుత్తి సమావేశాలు నిర్వహించారే తప్ప నేటికీ గిట్టుబాటు ధర కల్పించే విషయంలో పూర్తి గా విఫలమయ్యారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రంతో సఖ్యత కలిగి ఉన్న నేపథ్యంలో జిల్లాలో స్టాక్ ఉన్న గుజ్జు నిల్వలు ఎగుమతులకు అవకాశం కల్పించాలని, స్థానికంగా ఆలయాలలో భక్తులకు ఉచితంగా సరఫరా చేయాలని తద్వారా యజమానుల సమస్య పరిష్కారానికి తోడ్పడాలని అన్నారు. మామిడి, టమాటాకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు.

పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారిణి శ్రీవిద్య

పాడి రైతులకు అవగాహన

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం :

ఎస్ఆర్ పురం మండలం లోని రాఘవ రాజాపురం లో శనివారం కాసా ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరం స్థానిక పశువైద్యాధికారిశ్రీవిద్య ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పశువులు మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులను పిచికారి చేశారు. పశువులలో గర్భకోశ వ్యాధిని గుర్తించి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా శ్రీ విద్య మాట్లాడుతూ రైతులు యాజమాన్య పద్ధతులను పాటించి మంచి పోషక పదార్థాలు అందించడం ద్వారా తయారు చేసుకోవచ్చన్నారు. ఎక్కువ పాల ఉత్పత్తిని పొందవచ్చని సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు రీజినల్ డైరెక్టర్ కరుణ , కాసా ప్రాజెక్ట్ సిబ్బంది, పశువైద్య సిబ్బంది , రైతుల పాల్గొన్నారు .హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా అధికారులు స్పందించడం లేదనీ ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది.

అలరించిన భీముని వేషధారణ

కనువిందు చేసిన ద్రౌపదీ కల్యాణం

ప్రజాశక్తి -సోమల:

సోమల మండలం నంజంపేట సమీపంలోని గార్గేయ నది ఒడ్డున వెలసిన గార్గేయ గౌరీ లింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా శుక్రవారం రాత్రి ద్రౌపది కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాండవుల విగ్రహాలకు ద్రౌపది విగ్రహానికి ప్రత్యేక అలంకరణలు చేసి వేదికపై ప్రతిష్ఠించి వేద పండితులు ద్రౌపదీ కల్యాణాన్ని నిర్వహించగా భక్తులు ఆసక్తిగా తిలకించారు.

శనివారం బలి బండి గ్రామాలలో తిరిగి అన్నం, ఇతర ప్రసాదాలను సేకరించి మహాభారత యజ్ఞం వద్దకు తీసుకువచ్చారు. భీముడి వేషధారణ వేసి కళాకారుడు బలిబండిలో తిరుగుతూ పద్యాలు పాడుతూ ఆకట్టుకున్నారు. పగలు హరికథ రాత్రివేళల్లో నాటక కళామండలి వారిచే డ్రామాలు నిర్వహిస్తుండగా భక్తులు తిలకించడానికి అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

తాగునీటి సమస్య పరిష్కారం

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ లక్ష్మీపురం సమీపంలోని లేఅవుట్ బోరు బావిలో నీరు బోరు మోటారుకు అందకపోవడంతో అదనపు పైపులు దించి నీటిని అందించాలని కోరుతూ ఈ నెల 17వ తేదీ 'లక్ష్మీపురంలో దాహం దాహం..!' అనే శీర్షిక 'ప్రజాశక్తి' లో ప్రచురితమైన వార్తకు స్పందన లభించింది. స్పందించిన సర్పంచ్ రెడ్డప్ప అదనపు పైపులను కొనుగోలు చేసి శనివారం మధ్యాహ్నం బోరు బావిలో అమర్చి అనంతరం మోటారు బిగించి నీటిని వదిలారు. దీనిపై సర్పంచ్ మాట్లాడుతూ అదనపు పైపులు కొనుగోలు చేసుకొ చ్చామని అయితే బోరు బావిలో పైపులు దించే మిషన్ అందుబాటులో లేక పోవ డంతో ఆలస్యమైందని తెలిపారు. లేఅవుట్లో తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

బోరులో అదనపు పైపులు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఏఎంసిలో రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి -పుంగనూరు: పుంగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో కనీస సమస్యలను పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు డిమాండ్ చేశారు. వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో శనివారం నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుంగనూరు మార్కెటింగ్ యార్డులో ఆదాయం వున్నా మార్కెటింగ్ యార్డ్‌కు వచ్చే పోయే రైతులకు మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించకపోవడం బాధాకరమన్నారు. యార్డులో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లకు తాళం వేయడం వల్ల రైతులకు ప్రత్యేకంగా మహిళా రైతులకు మరుగుదొడ్లు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎండాకాలంలో తాగడానికి నీళ్లు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అధికారులు మార్కెటింగ్ యార్డులో రైతులకు కనీస వసతులు యుద్ధ ప్రాతిపదిక పైన చర్యలు చేపట్టాలని అధికారులను డిమాండు చేశారు. లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు అనంత రం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పుంగనూరు పట్టణ కార్యదర్శి కె రామమూర్తి, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి పి వెంకట రమణారెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్ మున్న పాల్గొన్నారు.

ఎంసి కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న నాయకులు

అధికారులు కనికరించలేదు..

- పరిష్కారం కాని ఇంటి వివాదం
- బాధిత మహిళ ఆవేదన

ప్రజాశక్తి-పలమనేరు: రాష్ట్ర హైకోర్టు ఆదేశాలిచ్చినా మండల అధికారులు కనికరించలేదని దీంతో ఇంటి స్థలం పరిష్కారం కాలేదని ఓ మహిళ మీడియా ముందు కంటతడి పెట్టుకుంది. బాధితురాలి కథనం మేరకు.. పలమనేరు పట్టణంలో బసవన్న గుడి సమీపంలో సర్వే నెంబర్ 568/2 లో తూర్పు పడమర 16 అడుగులు, ఉత్తర దక్షిణం 103 అడుగులు ఇంటి స్థలాన్ని తన ఇద్దరు అన్నలు అహ్మద్ బాష, మహమ్మద్ బాషలు కలిసి ఆడబిడ్డ కోసమని 2015లో రిజిస్టర్ ఆఫీసులో దాన దస్తావేజుగా రిజిస్టర్ చేసి ఇచ్చారని వివరించారు. తమకు ఉన్న ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆ స్థలంలో ఇల్లు నిర్మించలేకపోయామని తెలిపారు. 2016 లో స్థలం వున్న కారణంగా ఇల్లు నిర్మించుకోవడానికి మదనపల్లి సప్తగిరి గ్రామీణ బ్యాంకులో 11 లక్షల రూపాయలు అప్పు తీసుకున్నామన్నారు. ఇల్లు కట్టడానికి ఆ స్థలంలోకి వెళ్లగా ఇద్దరు వైసీపీ నాయకులు అడ్డుపడుతూ తమ తాతలు రాసిచ్చారని నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి తమను ఇబ్బందులకు గురి చేస్తూ స్థలంలోకి రానివ్వకుండా బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు తన పేరున అన్ని సక్రమంగా ఉన్నాయని, అందుకు పలమనేరు న్యాయస్థానం తనకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. అయినా పై తెలిపిన నాయకులు కోర్టు తీర్పును కూడా ధిక్కరించి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని కంటి తడి పెట్టారు. తాను ఒక ఉపాధ్యాయురాలు అయిన ప్పటికీ పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దు తామే గాని అన్యాయంగా మరొకరికి కీడుకు పాల్పడమని పేర్కొన్నారు. తన భర్తకు ఆరోగ్యం క్షీణించడంతో ఆ స్థలం దక్కించుకోవాలనే సంకల్పంతో తాను, తన నా కొడుకు కాళ్లరిగేలా అధికారుల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కరించకుండా చీదరించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రక్షణ కల్పించాల్సిన అధికారులు చేతులు పైకి ఎత్తేశారన్నారు. విధి లేక రాష్ట్ర హైకోర్టు ద్వారా ఆదేశాలు తీసుకొచ్చినా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఈ స్థలానికి పన్నులు చెల్లిస్తున్నామని, ఇల్లు నిర్మాణం కోసం టౌన్ ప్లాన్ అప్రూవల్ కూడా మంజూరు చేశారన్నారు. తమకు ఎలాంటి రాజకీయ బలం, సొంత బలగం లేవని గుర్తించిన వైసిపి నాయకులు ధన, రాజకీయ బలంతో తమను మానసిక క్షోభకు గురి చేస్తున్నారని తెలిపారు. కలెక్టర్ అయిన కనికరిస్తారేమోనని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మొరపెట్టుకున్నామని అయినా స్పందన లేదన్నారు.. తమకున్న సమస్యను మీడియా వారైనా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని, లేని పక్షంలో తహశీల్దారు కార్యాలయం ఎదుట పరిష్కారమయ్యే వరకు నిరసన చేపడతామని హెచ్చరించారు.

అంతా 'నూనె'మయం!

- నిబంధనలు పాటించని తినుబండారాల దుకాణాలు
- ప్రజారోగ్యం గాలికి
- నిద్రావస్థలో తనిఖీ అధికారులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం:

రోడ్డుపక్కనే వున్న దుకాణాల్లో విక్రయించే తినుబండారాలు అంతా నూనెమయమయ్యాయి. పిండితే చుక్కలు చుక్కలుగా ధారకడుతోంది. ఏ మోతాదులో ఎంత వాడుతారో ఎవరికీ తెలియదు.. ఏ నూనె వాడతారో అర్థం కాదు.. అందరూ నోటికి రుచిగా వుందనే చూస్తారు.. వాడకం ఎక్కువైతే ఊబకాయం, గుండె సమస్యలు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇలా నాణ్యతా లోపంతో విక్రయాలు, నిబంధనలు పాటించని దుకాణాలు మండల పరిధిలో చాలా వున్నాయి..సంబంధిత శాఖాధికారులు దుకాణాలపై నిఘా వుంచి తగిన చర్యలు తీసుకుని ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

అంతా నూనెమయం

మండలంలో 25 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ప్రధానంగా పచ్చికాపల్లం, వెదురుకుప్పం, చవటగుంట, జక్కదొన, పాతగుంట, మొరవా దేవలంపేట ప్రధాన వాణిజ్య కూడళ్లుగా ఉన్నాయి. ఈ ప్రాంతాలలో ఎక్కువగా హోటల్స్ , బజ్జీలు, బోండాలు, వడలు తదితర దుకాణాలు వున్నాయి. వీటి తయారీకి ఆ యజమానులు ఎక్కువ భాగం మరిగించిన నూనె వాడుతారని స్థానికులు చెబుతున్నారు. నూనెను మార్చడం సంగతేమిటో కాని, ఇక్కడ దుకాణాలను గమనిస్తే బాణలిలో నూనె నల్లగా మసక బారి ఉంటుంది. ఎక్కువ సాయంత్రం సమయం అయితే బోండాలు, బజ్జీలు, వడలు ఇలాంటి విక్రయాలు అధికంగా వుంటాయి. వీటిని స్థానిక ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేసి తింటుంటారు. మూడేళ్ల క్రితం పచ్చికాపలంలో ఓ వ్యక్తి రోడ్డు పక్కనే వున్న అంగట్లో బరోటా తిని విషాహార బారిన పడి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఇలా తినుబండారాలు తిని కడుపు నొప్పి వంటి స్వల్ప అనారోగ్యానికి గురై చికిత్స కోసం తరచూ ఆస్పత్రికి వస్తుంటారని వైద్యులు పేర్కొంటున్నారు.

నిబంధనలు గాలికి

సంబంధిత అధికారులు స్పందించి నిబంధనలు పాటించని దుకాణదారులకు కౌన్సెలింగ్ ఇచ్చి ప్రజా ఆరోగ్యాన్ని పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

వంట నూనె అధికంగా వాడితే ముప్పు

మనం వంటనూనె అధికంగా వాడితే అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం వుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నూనె వాడకం తగ్గించుకోవాలి

నూనె వాడకం తగ్గించుకుంటే ఖర్చు ఆదా అవుతుందని, ఆగ ఆరోగ్యాన్ని సైతం కాపాడుకోవచ్చని స్థానికులు పేర్కొంటున్నారు. నెలకు నలుగురు కుటుంబ సభ్యులు ఉన్న వారికి నాలుగు లీటర్ల వంటనూనె బదులుగా ఖరీదైన ఆయిల్ రెండు లీటర్లు వాడుకోవడం మేలంటున్నారు. నూనె వాడకం సగం తగ్గించుకుంటే ఇంటి ఖర్చు ఆగవుతుందని, ఆరోగ్యానికి మేలు కలుగుతుందని పేర్కొంటున్నారు. నూనె కలిగిన ఆహార పదార్థాలు తగ్గించుకుని అన్నంలో పప్పు, వడల వాడకం పెంచుకోవాలని స్థానికులు చెబుతున్నారు. ఇలా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అంటున్నారు.

అనారోగ్యాన్ని కొనుక్కున్నట్లే!

మోతాదుకు మించి నూనె వాడటం ద్వారా అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. కడుపు ఉబ్బరం సమస్యలు తలెత్తుతాయి. జీర్ణక్రియ పై ప్రభావం పడుతుంది. ఊబకాయం ,గుండె జబ్బులకు కారణమవుతుంది క్యాన్సర్ వచ్చే ప్రమాదం వుంది. పదే పదే మరిగిస్తే.... ఏమవుతుందో ఒకసారి చూద్దాం... ఒకసారి ఉపయోగించిన నూనెను మళ్లీ మళ్లి వాడకూడదు... రంగు మారిన నూనెను ఉపయోగించకూడదు రోడ్డు పక్కన బండ్లపై వాడే నూనె చూస్తే నల్లగా జిగురుగా ఉంటుంది. దాన్ని మళ్లి ఉపయోగించి ఆహార పదార్థాలు తయారు చేస్తారు. వాటిని తింటాం ..ఎలా ఉపయోగించినా నూనెను తిరిగి మళ్లీ వాడిన కూరలు త్వరగా చెడిపోతాయి. జీర్ణ వ్యవస్థ పాడవుతుంది. శరీర సమస్యలతో పాటు జీర్ణ వ్యవస్థ నెమ్మదిస్తుంది.

- డాక్టర్ చెంగారెడ్డి, పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి,

మైనారిటీ సోదరులు తరలిరావాలి

- రాష్ట్ర మైనారిటీ నేత సుహేల్ బాషా

ప్రజాశక్తి -పుంగనూరు: కడపలో ఈ నెల 27,28,29, వ తేదీల్లో నిర్వహించనున్న మహానాడుకు మైనారిటీ సోదరులు తరలిరావాలని మైనార్టీ నాయకుడు సయ్యద్ సుహేల్ బాషా శనివారం పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతుందన్నారు. దేశంలో ఏదైనా సెక్యులర్ పార్టీ టిడిపియే అన్నారు. మొదటి నుంచి మైనార్టీలు పార్టీకి అండగా ఉన్నారని, మైనారిటీ సోదరులందరూ కలిసి పెద్ద ఎత్తున మహానాడుకు తరలిరావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీల కులు పాల్గొన్నారు.

పలమనేరు: కడపలో నిర్వహించనున్న మహానాడుకు అందరూ తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరుతూ నియోజకవర్గ పరిశీలకులు, మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి కోరారు. పలమనేరు టిడిపి కార్యాలయంలో శనివారం ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి ప్రభుత్వ అరాచకాలు, టిడిపి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. పేదల కడుపు నింపే పార్టీ టిడిపి అని, పేదల కడుపు కొట్టే పార్టీ వైసిపి అని విమర్శలు గుప్పించారు. కట్టడం టిడిపి నైజం, కూల్చడం వైసిపి వంతు అన్నారు. ఈ సమావేశంలో వి కోట, బైరెడ్డిపల్లి, పలమనేరు టౌన్, రూరల్, పెద్దపంజాణి, గంగవరం మండలాల పార్టీ అధ్యక్షులు రంగనాథ్, కిషోర్ గౌడ్, ఆర్బీసీ కుట్టి, నాగరాజు రెడ్డి, ఆనంద్, సోమశేఖర్ గౌడ్, సీనియర్ నాయకులు ఆర్వీ బాలాజీ పాల్గొన్నారు.

పలమనేరు సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి

గజరాజుపై వేణుగోపాలుడు విహారం

ప్రజాశక్తి -కార్వేటినగరం: కార్వేటినగరం వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శనివారం రాత్రి గజవాహనంపై, ఉదయం హనుమంత వాహనంపై స్వామి పురవీధుల్లో విహరించారు. చెక్కభజనలు, కోలాట ప్రదర్శనలు, భక్తజనుల గోవిందనామస్మరం, మంగళవాయిద్యాలు నడుమ వాహన సేవలు అంగరంగ వైభవంగా సాగాయి. వేకువజామున సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా తోమాల, అర్చన, కొలువు, పంచాంగ శ్రవణం. సహస్రనామార్చన, శాత్తుమొర, మొదటి గంట, బలి కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం 7.30 గంటల నుంచి 9.30 గంటల వరకు హనుమంత వాహనంపై కొలువుదీరి పురవీధుల్లో విహరించారు. మధ్యాహ్నం 3గంటల నుంచి వేదపండితులు ఆలయంలో వేదమంత్రాలతో వసంతోత్సవం, ఆస్థానం నిర్వహించి పసుపు, చందనం, వంటి సుగంధ ద్రవ్యాలను చల్లారు. అనంతరం స్వామిని మాడవీధులో మేళతాళాల నడుమ ఊరేగించారు. అనంతరం ఆలయంలో శుద్ధి, తోమాల, రాత్రి గంట చేపట్టారు. అదే విధంగా సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల నడుమ పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పాలతో సుందరంగా అలంకరించి ఆలయ ఆవరణలోని ఊజంల్ మండపంలోకి వేంచేసి వేద పండితులు వేదమంత్రాల నడుమ ఊంజల్ సేవ నిర్వహించారు.

అలరించిన సంగీత కచ్చేరి

టీ టీ డీ ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిర్ నిర్వహించిన సంగీత కచ్చేరి భక్తులను ఎంతో ఆకట్టుకుంది. స్వామికి వివిధ రకాలైన భక్తి గీతాలను ఆలపించారు.